# నినాదం
నిఖార్సైన జర్నలిజం

# సాహితీ లహరి

ఆదివారం 8-03-2026


## కాశీ క్షేత్రం...



సీ.
విఖ్యాతి నొందిన వేదపురాణాలు
కావ్యేతిహాసాలు గందుమిచట
గంగ హిందూస్తాని సంగీతమును పట్టు
వస్త్రాలనిలయమై వాసికెక్కె
సత్సంగముల నిల్ప సంస్కృత పండితుల్
వెలుగొందుచున్నట్టి వేదిక యిది
వ్యాసాది వేదాంత పండితోత్తము లెల్ల
తిరుగాడినటువంటి దివ్య భూమి

తే.గీ.
కవులు పండితులెందరో గౌరవ యతి
తత్త్వ బోధకు లుండిన ధన్యభూమి
సకల భక్త మోక్ష ప్రద స్థావరమ్ము
శివ కృపాలబ్ద వరము కాశీపురమ్ము.





జి.గోవర్ధన్, తెలుగు లెక్చరర్,
ఎం.వి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలెం,
మహబూబ్ నగర్ 509001
8106384812


## తెలుగులో తెలుగెంత?

నేను నడిచిన నా కాలిజోళ్ళు
చెప్పులొచ్చినరోజు నుండి వెనుక పడిపోయాయి.
కంగోరుపై(అటుకు)ఉన్న మా పాతసామాన్లు!
స్టోర్రూమ్ పదంతో కట్టబడ్డాయ్.
నేటి తరానికి తెలుగు పాతబడిపోయింది!
కొత్తపదాలు ఆదేశంగా వస్తున్నాయనుకున్నా,
ఆక్రమిస్తాయని ఊహించలేదు!
ఎసర కాగే నీరు, తడిబియ్యం ?
తోడులేక ఆవిరైపోయాయి.
గంజి గిన్నె దిగులుతో ఉడికిన బువ్వను చూస్తూ...
మూడువిజిల్స్ శబ్దం విని, మూగబోయింది.
రోకలికి, రుబ్బురోలుకి పలకరించే దిక్కేలేదు.
నాయనమ్మ కథలు దిగదుడుపయ్యాయి!
నేను మరిచినవి పదాలు కావు,
వెనుకటి గత కాల జ్ఞాపకాలని!
ఆకుని(ఆకలితో) ఉన్నరోజు నాయనమ్మ
తినిపించిన గోరుముద్దలను మరిచిపోయాను!
మడులు, మెట్టల దారుల వెంట పశువులను
తోలిన రోజులను మరిచిపోయాను!
పదాలు నన్ను వదిలిపోలేదు.
పదాలకు నేను దూరమైపోయాను!
అమ్మమ్మ సిరిల్లు, పేడతో అలికిన గచ్చులు,
సున్నం పోసిన గోడలు! ఈరోజు కరిగి పోయాయి.
ఆంగ్ల యాంత్రిక జీవితం మనసులోని
పదాలను నామోషీగా అనిచివేసాయి!
అయిన పదాలను వదులుకుంటూ..
కాని పదాల వెనుక మోహంతో అదుక్కుంటున్నాం!
మూట కట్టిన బట్టలమూటలా, తాళం వేసిన పెట్టెలా,
విరిగిన బొమ్మలా పక్కన పడేసాం! అంతే!
తెలుగుజాతికి తెలుగుభాష కొంగు చాచాలా?
వద్దు! ఇది రాక ముందే ఆలోచించండి.
తెలుగులో తెలుగెంతని?




కోట విజయ్ కుమార్
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,


# వివక్షను ప్రశ్నించడమే స్త్రీవాద కవిత్వ ప్రధాన లక్ష్యం

నేటి మహిళా దినోత్సవ సందర్భంగా స్త్రీ స్వేచ్ఛ, స్వాతంత్రాలను గౌరవిస్తూ, విద్య, వైద్య, వ్యాపార, రాజకీయ, బ్యాంకింగ్, క్రీడ, అంతరిక్ష, టెక్నాలజీ వంటి రంగాలన్నిం టిలో ముందు ఉంటూ తమదైన ప్రతిభను చాటి చెబుతున్న స్త్రీలను అభినందిస్తూ, కవిత్వంలో కూడా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కొందరు స్త్రీవాద రచయిత్రుల కవితలను కొన్నింటిని ఈ సందర్భంలో జ్ఞాపకం చేసుకుందాం... మార్చి 8 అంటే గుర్తొచ్చేది అంతర్జాతీయ మహిళా దినోత్సవం. దీనిని మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవం అని పిలిచేవారు. మొదటి జాతీయ మహిళా దినోత్సవాన్ని యునైటెడ్ స్టేట్స్‌లో 1909 ఫిబ్రవరి 28వ తారీఖున జరుపు కున్నారు. ఇది ప్రారంభంలో వేరువేరు తేదీల్లో జరిగినా, 1914 సంవత్సరం నుండి మార్చి 8న మహిళా దినోత్సవంగా తీర్మానించారు. అప్పటి నుంచి మార్చి 8వ తేదీన మహిళలు దేనిలోనూ తక్కువ కాదంటూ స్త్రీ, పురుష సమానత్వాన్ని తెలియజేస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మహిళలందరూ దీన్నొక వేడుకగా చేసుకుంటున్నారు. ఐక్యరాజ్యసమితి 1975 సంవత్సరాన్ని అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించింది. అలాగే 1976- 85 మధ్యకాలన్ని అంతర్జాతీయ మహిళా దశాబ్దంగా పేర్కొంది.

భావ, అభ్యుదయ, విప్లవ కవిత్వాల లాగానే స్త్రీవాద కవిత్వం కూడా ఒక ప్రత్యేక గుర్తింపుని తెచ్చుకుంది. ఓల్గా తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి స్త్రీవాద రచయిత్రిగా గుర్తింపు పొందారు. ఈమె 1972లో రాసిన ' ప్రతి స్త్రీ నిర్మల కావాలి 'అనే కవిత మొట్టమొదటి స్త్రీవాద కవిత. అయితే 1980 నుంచి స్త్రీవాద ధోరణి ఎక్కువగా కనిపిస్తుంది. 1987 లో స్త్రీ వాదం అనే పదాన్ని" ఫెమినిజం" అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా మొట్టమొదటిగా జయప్రభ వాడారు. స్త్రీ వాదంపై తొలి డాక్టరేట్, ఎం.ఫిల్ చేసినది కూడా ఈమె కావడం గుర్తించాలి. ఇలా కొంతమంది స్త్రీవాదలందరూ కలిసి 'అస్మిత' సంస్థగా ఏర్పడ్డారు. ఈ సంస్థ ద్వారానే స్త్రీవాదాన్ని ప్రోత్సహిస్తూ ' భూమిక' అనే మాస పత్రికను కూడా నడిపారు. ఈ సంస్థ ద్వారా వచ్చినదే ' నీలిమేఘాలు' అనే తొలి స్త్రీ వాద కవితా సంకలనం. దీనిలో ప్రసిద్ధి చెందిన కవితలెన్నో ఉన్నాయి. వాటిలో జయప్రభ రాసిన ' పైటను తగలెయ్యాలి',కొండేపూడి నిర్మల రాసిన 'లేబర్ రూమ్ ' వంటి కవితలు కొందరి రచయితల విమర్శలకు గురైనా, చేకూరి రామారావు, వరవరరావు, రావి ప్రేమలత, రావి భారతి వంటి వారు ప్రముఖులు సమర్థించారు.

"అమ్మ కట్టుకున్న చీర అంచుల్లా
అమ్మకు మేమిద్దరం
అమ్మ దృష్టిలో నేను మైనస్, వాడు ప్లస్

చీర ఒక అంచును గుండెలపై పదిలంగా అమర్చుకున్నట్లు అమ్మ తమ్ముడ్ని హృదయానికి హత్తుకుంటుంది. కాళ్లకు అడ్డుపడే అంచులా నా మాటలతో తన్నుతుంది ( పెద్దవ్వనీ చెప్తా) శ్రీమతి 'పెద్దవ్వనీ చెప్తా' ఈ కవితలో ఉన్నట్లుగానే నేటికీ కొన్ని కుటుంబాలలో ఆడ ,మగ పిల్లలను సమానంగా చూడకుండా కొంత వ్యత్యాసంతో పెంచటం చూస్తున్నాం. ఆ వ్యత్యాసం ఆడపిల్లల్లో ఆత్మన్యూనతా భావాన్ని కలిగిస్తుంది. సమాజంలో తాము దేనికి పనికిరాము అనే అభిప్రాయానికి వచ్చేలా చేస్తుంది. ఇది ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలలో జరుగుతుంది. ఆడపిల్ల పుట్టడాన్ని వారు అన్ని రకాలుగా నష్టంగా భావిస్తారు. మగవాడు అయితే ఇంటి బాధ్యత వహిస్తాడని మక్కువ చూపిస్తారు. ఆడపిల్లను మాత్రం చదివించి, కట్నం ఇచ్చి పెళ్లి చేయాలంటే వాళ్ల తలకు మించిన భారమే. అయితే ధనికుల్లో మాత్రం వారసుడు అయితే ఇంటి పేరు నిలబెడతాడని లేదా తమ తారతరాల నుంచి వస్తున్న ఆస్తులు అనుభవించడానికి వారసుడైతే బాగుంటుందని భావిస్తారు. నేటికీ ప్రసవించే స్త్రీ కూతురైనా, కోడలైనా మొదట మగపిల్లాడే కోరుకోవడం గమనార్హం.

**"నాన్న అమ్మను కొడతాడు**
**అమ్మ కొడుకూ అమ్మని కొడతాడు**
**అమ్మ గుండెవిచ్చి విరిసిన రెండు నెత్తుటి పువ్వుల్లా**
**అమ్మకు మాత్రం మేమిద్దరమే**
**బిక్కు బిక్కుమని చెయ్యి చెయ్యి పట్టుకుని**
**నాన్న నాన్న అమ్మను కొట్టొద్దు** కొడితే మా అమ్మ చచ్చిపోతుంది నాన్న అని బావురుమంటాము."

**(గుక్కపట్టిన బాల్యం)- పద్మావతి**

తాగుబోతు తండ్రి తల్లిని కొడుతూ, హింసిస్తుంటే అది చూసిన పిల్లలు తట్టుకోలేక భయంతో తల్లడిల్లిపోతూ ఉంటారు. పిల్లలకు తల్లే ప్రపంచం, తల్లే దైవం, తల్లే సర్వస్వం. అలాంటి తల్లి తండ్రి చేతిలో దెబ్బలు తింటూ, కన్నీళ్లు పెడుతుంటే అమ్మ పడుతున్న బాధ తాము అనుభవిస్తూ విలవిల లాడిపోతారు...తాగటానికి డబ్బులు ఇవ్వకపోతే తల్లిని కొడుతున్న కొడుకులనూ నేటి సమాజంలో చూస్తున్నాం. అలాంటి దయనీయమైన పరిస్థితికి ఈ కవిత్వం అద్దం పడుతుంది.

అయ్యో!
పాలింగి పోవడానికున్నట్లు
మనసింకి పోవడానికి
మాత్రలుంటే ఎంత బావుండు
( అబార్షన్ స్టేట్మెంట్)- పాడిబండ్ల రజని

పరిస్థితులు అనుకూలించకో ,ప్రేమించిన వాడి మోసానికి గురయ్యో, పెంచే తీరిక లేకో అనుకోకుండా వచ్చిన గర్భాన్ని తీయిస్తూ ఉంటారు. తాము చేసిన పొరపాటుకు పిండానికి శిక్ష విధిస్తారు. గర్భాన్ని అయితే తీయిస్తారు కానీ ,దాని తర్వాత ఆ తల్లి పడే ఆవేదన,ఒక నిరపరాధిని హత్య చేశాననే మానసిక నేరారోపణ అధిగమించటానికి ఏ మాత్రలుంటాయి...?

"ప్రపంచంలోని నరకమో
నరకంలోని ప్రపంచమో
త్రీడీలో చూస్తున్నట్లే ఉంటుంది
లేబర్ రూమ్ (ప్రసవించే గది)లో
అడుగు పెడితే చాలు."
(లేబర్ రూమ్)- కొండే పూడి నిర్మల...

నేటికీ పల్లెల్లో ఆడపిల్లని మనస్ఫూర్తిగా నోటి నిండా నవ్వనివ్వరు, నలుగురులో కూర్చోనివ్వరు, ఇంట్లోనే ఉన్నా చున్నీ లేకుండా ఉండనివ్వరు. ఇలా అన్నిటికీ నిర్బంధాలు విధిస్తారు. అది తమ ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉంటుంది అనే విషయాన్ని గ్రహించరు.

**"అందమైన దోపిడీకి**
**పవిత్రమైన హింసకూ**
**న్యాయమైన దాస్యానికీ**
**బలైపోయిన నేను**
**భారత స్త్రీ ని!"**
**(ప్రతి స్త్రీ ఓ నిర్మల కావాలి) - ఓల్గా**

అనుమానాలకు అవమానాలకు బలైపోయిన స్త్రీల గురించి, కూలి నాలి చేసుకుని పిల్లల్ని పోషిస్తున్న తల్లుల గురించి, తాగుబోతు మొగుడి తన్నులకు బలై, ఆడబిడ్డల ఆరండ్లకు గురై బతికే భారమై పిల్లలకు విషమిచ్చి చంపుతున్న తల్లుల దీనగాథ ఈ కవితలో కనిపిస్తుంది.

స్త్రీవాద కవిత్వం ప్రధానంగా పితృస్వామ్య వ్యవస్థలోని అణచివేతను ఎదిరించి, స్త్రీ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే ఒక శక్తివంతమైన చైతన్య స్రవంతి. శతాబ్దాల మౌనాన్ని ఛేదిస్తూ, వంటింటి శ్రమ దోపిడీని, సామాజిక వివక్షను నిరసించింది. అంతేకాదు, స్త్రీ తన శరీరంపై తనకే సర్వహక్కులు ఉన్నాయని ప్రకటించడం ఒక విప్లవాత్మకమైన సందేశం. కేవలం వేదనను మాత్రమే కాకుండా, పురుష కేంద్రక సమాజం నిర్దేశించిన కట్టుబాట్లను ధిక్కరించి, సమానత్వం కోసం పోరాడే ఒక విప్లవాత్మక గళాన్ని వినిపిస్తుంది. స్త్రీలపై జరుగుతున్న లైంగిక హింస పట్ల కవయిత్రులు అత్యంత పదునైన, నిరసన పూరితమైన గళాన్ని వినిపించారు. స్త్రీ శరీరాన్ని కేవలం ఒక భోగ వస్తువుగా, యుద్ధ క్షేత్రంగా చూసే పితృస్వామ్య పోకడలను వారు తీవ్రంగా ఖండించారు. ఈ విధమైన

ప్రతి స్త్రీ మాతృత్వాన్ని అనుభవించాలంటే, స్త్రీగా తన ప్రకృతి ధర్మం నిర్వర్తించి విజయం పొందాలంటే, 9 నెలలు బిడ్డను మోయటం ఒక ఎత్తు అయితే చివరి రోజు ప్రసవించే రోజు ఒక ఎత్తు. తాను దాదాపుగా మరణించి బతికే రోజు. విశ్వ సుందరి కిరీటాన్ని పొందినా రాని విజయ గర్వం ఒక ప్రాణికి జన్మనిచ్చిన తల్లిగా తాను కలిగి ఉంటుంది. ఇది జరగటానికి ముందు ఆ ప్రసూతి గదిలో అరుపులు, కేకలు ఆర్తనాదాలతో నరకయాతన పడుతుంది.

"ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి
అయినా, చివరకు వంటింటి గిన్నెలన్నిటి పైనా
మా నాన్న పేరే!"
(వంటిల్లు)- విమల

ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఇంట్లో పనులన్నీ చుక్క పెడుతున్నా, వంట గదిలోనే మగ్గిపోతున్నా తాను నిత్యం వాడే ఆ వస్తువులపై కూడా తనకు అధికారం లేదన్నట్లుగా గిన్నెలు, గరిటెలపై కూడా పురుషుడి పేరే ఉండటం పురుషాధిక్యతకు నిదర్శనం.

"నేనమ్మలో ఉన్నప్పుడు
నేను కావాలని అమ్మ కోరుకున్నట్టు
నాన్నకు తెలియగానే
ఈడ్చి చెంప పగల గొట్టిన నాన్న దెబ్బకి
నేనెవరో నాకు తెలిసింది.
నేనొక స్త్రీ ని -
నేను నిషిద్ధ జీవిని -
మొన్నటిదాకా నా నవ్వు నిషిద్ధం
నేడు నా బ్రతుకూ నిషిద్ధమే.
(నిషిద్ధ స్వప్నం) "- శ్రీమతి

కవిత్వం 1870ల తర్వాత వచ్చినా, అది నీలిమేఘాలు కవితా సంపుటి తర్వాత ఒక సైద్ధాంతిక, తాత్త్విక పునాధులపై నిలబడి సుమారు నాలుగు దశాబ్దాల పాటు తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసింది. అయితే,స్త్రీలలో చైతన్యం స్త్రీవాదుల మూలంగానే వచ్చింది అనటం కూడా సరికాదు, ఎందుకంటే స్త్రీవాదం అనే పదం కూడా పుట్టక ముందే 1862 లోనే హితసూచిని పత్రిక ద్వారా సామినేని ముద్దు నరసింహం నాయుడు స్త్రీలపై జరిగే అన్యాయాలను ప్రస్తావించాడు. కందుకూరి వీరేశ లింగం బాలికలకు పాఠశాలలను స్థాపించారు, వితంతు వివాహాలను ప్రోత్సహించారు. స్త్రీ జనోద్ధరణ కోసం పాటుపడ్డారు. గురజాడ అప్పారావు 'పూర్ణమ్మ, కన్యక ' గేయాలలో' దిద్దుబాటు 'అనే కథానికలో స్త్రీల, అవున త్యాన్ని గురించి, వారి అంతరంగ వ్యధలను గురించి తెలియ జేశారు. అయితే, అవి స్త్రీల అభ్యుదయాన్ని ఆకాంక్షించి రచించిన రచనలుగా గుర్తిస్తూ, స్త్రీవాదాన్ని ఒక సిద్ధాంతంగా తీసుకొచ్చారనేది స్పష్టంగా గుర్తించాల్సి ఉంది.




మోటూరి హిమబిందు
రీసెర్చ్ స్కాలర్, తెలుగు శాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్ - 500 046.
ఫోన్: 6302229300


## వనితా ఓ ఓ ఓ వనితా

రుధిర భాష్పాలు నీ హృదయ లోతుల్లోంచి
కట్టలు తెంచుకొని పారుతున్నా....
సుడిగుండ శోకసముద్రాలు
నీ జీవననౌకను అతలాకుతలంచేస్తున్నా...
స్థితప్రజ్ఞతతో స్థిరస్థర్యంతో ఈ భయానక
సామాజిక స్వార్ధ విషవలయాల
కాలగమనాన్నిఎదురీది...
నీ ఉనికిని వేనోళ్ళ చాటుకుంటున్న
ధీరజా-ధరణీ- వసుమతీ నీకు జోహార్లు జోహార్లు..
నీవులేనిదెక్కడమ్మా.?!?.
ఒక్క బార్బరు.. షాపులో తప్ప...
నట్టింట్లో.. దీపం వెలిగించి...
నీకు నీవే చుక్కాని వై..
ఆకస్మిక బావురు పిల్లులు, చడీ చప్పుడులేని
ముల్లపందులదాడులు...అనునిముషం...
సదా సర్వదా సర్వత్రా
ఈ ఈ ఈ పిడుగులకు అదరక బెదరక
ఫీనిక్స్ పక్షి లా అంతరిక్షంలో షికార్లు కొడుతున్న..?!
నీవు లేని దెక్కడమ్మ?!
సృష్టికి మూలాధారం..
నీవే మహిళా ఓ ఓ ఓ..మహిళా!
బ్లా బ్లా బ్లా బూటక నాటక వికట
యుక్తుల మానవాకార నీచ
నికృష్ట కీచకులు అడుగడుగునా..
తస్మాత్ జాగ్రత్త సుమీ..
వీరి- ఉత్తుత్తి కాలక్షేప
ఉత్సాహ ప్రోత్సాహ సుడిలో పడక..
ఫిరంగి లా ప్రేలి నీకు నీవే సైనికుని లా మారాలి..
సర్వకాల సర్వావస్థలయందు పెనుప్రమాదం
పసిగట్టి.. చుట్టూ ఉన్న శత్రు
పద్మవ్యూహాలను .. ఛేదించి ...
నీకు నీవే విజృంభించి సైనికుని లా విజయకేతనం
ఎగురవేయాలి...లిమూర్ఖంగా ఉండడంతోనే
పిరికితనం జయించగలవు..
మార్క్స్ చెప్పిన నీతి పాఠం...
నీవేమిటో నిరూపించి
నిర్వహించి నిర్వచించి నిష్కర్షగా...
ధ్వజస్థంబంవోలే.. నిలువెత్తున..
నిటారుగా నిలబడి జోహార్ అనిపించుకోవాలి..
శాశ్వత సంతకం చేసి
చివరి శ్వాస వదలాలి... అంతే గానీ...
అచ్చిక బుచ్చిక కబుర్లు, కాకరకాయలు,
కాలాన్ని ఖూనీ చేసే ఇచ్చకాలుకు...లొంగక..
వజ్రసంకల్పంతో పట్టుదల అనే వజ్రాయుధంతో..
అనూహ్య అసమానవిజయాలతో...
ఏనుగు అంబారి అధిరోహణ జరిగి తీరాలి....
ఓ ఓఓ నిత్యచలనశీలీ?!
అనంత శాశ్వత కీర్తి ప్రతిష్టలకు
నీ చిరునామాయే శిరోధార్యం (నెలవు)
వెనుక అడుగే లేని..
నీ జీవిత నిఘంటువులో
గురి తప్పని ఆశయ ధనుస్సు ఎక్కిపెట్టి ...
నీ చుట్టూ పరిభ్రమిస్తూన్న..
ఈ ఆధునిక నాటక బూటక
దుష్టదుర్యోధన దుశ్శా సన..
కీచక సైంధవ.. ఊసరవెల్లుల...
బహురూప గూడుపుఠాణి గుంపులు.. బారినుండి...
గురజాడ- సౌదామిని శౌర్యధైర్యాలు తలచుకుని ..
"మహా విజృంభణం" అనివార్యం..
నీఉద్వేగ సాహసఖడ్గంతో
కోటిశకలాలుగా ఛేదించుట అత్యంత అవశ్యం....
శత్రువు ఎంతబలవంతుడైతే.. మాత్రం ఏమి...?!? ..
పూరణాలైనా పుంఖానుపుంఖాలుగా..
కథలైనా, కావ్యాలైనా.. చెప్పేది ఒక్కటే....
అదిగదిగో.. ఒకే ఒక్క ద్రౌపది చాలదా?!?..
నిన్నమొన్నటి మణిపూర్ సంఘటన,
పశ్చిమబెంగాళ్ వైద్య విద్యార్థిని
ఉదంతం చాలదా...?!?
స్త్రీ జాతికి జరుగుతున్న...
ఈమానవాకార పిశాచల
ఘోర కైంకర్యాలు..తెలియనివా????
అవును అవును అవును-సిరులను
ముడిపెట్టని ద్రౌపది...
దుశ్శాసనుని అంతం చూసిన..
ద్రుపదుని కుమార్తె...గుర్తుంచుకో...
ఘనీభవించిన అనాలోచిత
మూర్ఖ ఆచారాలు అంటగట్టి...
నిన్ను అంతర్నిబిడం చేసి
ఆడిస్తున్న వైనం... తెలియనిదా...?!?
డెబ్బై తొమ్మిదవ స్వాతంత్ర్య దినోత్సవం..
ఔరా!? పాలకుల కాలయాపన-నిర్దిష్ట గమ్యం లేని
గమనంతో మనపాలిట..
నీకు నీవే సైనికుడవు లా...
ఓజోన్ పరిరక్షణ పొర ఏర్పరుచుకుని...
మహామహా సంఖ్యాలా...
నిలువెత్తు ఎవరెస్టు శిఖరంగా ప్రభవించు.
జైహింద్ ఓ ఓ ఓ నారీ
శిరోమణి... జోహార్లు జోహార్లు జోహార్లు..


రచన : పత్తి సుమతి... శ్రీకాకుళం: 9108521585


## సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం *నినాదం* పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

## సాయి సాహిత్య ముచ్చట్లు 2

# తెలుగులో తొలి కథ - స్త్రీవిద్య, ధనత్రయోదశి

మానవునికి ఊహ తెలిసినప్పటి నుంచే కథ ఉంది. కానీ తెలుగు సాహిత్యంలో 'తొలి కథ' ఏది అనే విషయంపై విమర్శకులలో ఏకాభిప్రాయం లేదు. గురజాడ అప్పారావు రాసిన 'దిద్దుబాటు' (1910) మొట్టమొదటి ఆధునిక కథానిక అని చాలామంది విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, లలిత (1902), విశాఖ (1904), శ్రీవిద్య (1902), ధనత్రయోదశి (1902) వంటి కథలలో ఒకదానిని తొలి తెలుగు కథగా గుర్తించే వారు కూడా ఉన్నారు. మరోవైపు, తొలి తెలుగు కథానిక తెలంగాణ ప్రాంతం నుండి వచ్చిందనే వాదన కూడా బలంగా ఉంది, కానీ దానిపై తగినంత చర్చ జరగలేదు.

ఇప్పుడు మనం బండారు అచ్చమాంబ రాసిన 'స్త్రీవిద్య', 'ధనత్రయోదశి' కథలను పరిశీలిస్తే, వాటిలో బలమైన సంస్కరణ దృక్పథం కనిపిస్తుంది.

**స్త్రీవిద్య (భార్యాభర్తల సంవాదం)...** ఈ కథకు 'భార్యాభర్తల సంవాదం' అనే మరో పేరు కూడా ఉంది. పెళ్లయిన తర్వాత భర్త ఉన్నత చదువుల కోసం వెళ్తూ, తన భార్యను చదువుకోమని, తనకు ఉత్తరాలు రాయమని ప్రోత్సహిస్తాడు. స్త్రీలకు విద్య ఎంతో అవసరమని ఆయన ప్రబోధిస్తాడు. చదువుకుంటే ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని భర్త తన భార్యకు సూచిస్తాడు. ముఖ్యంగా, స్త్రీలు చదువుకోవడం వల్ల వారి పిల్లలు జ్ఞానవంతులవుతారని, తండ్రి కంటే తల్లి ద్వారానే పిల్లలు ఎక్కువ జ్ఞానాన్ని పొందుతారని ఈ కథ వివరిస్తుంది. 1902 కాలంలోనే అచ్చమాంబ గారు స్త్రీ విద్య ప్రాధాన్యతను ఇలా చాటిచెప్పారు. అయితే, కుటుంబంలో ఎవరూ చదవలేదన్న భయం, ఇతరులు ఏమనుకుంటారోనన్న అభద్రతా భావం వల్ల కథానాయిక మొదట చదువుపై ఆసక్తి చూపదు. కానీ చివరికి చదువు విలువను తెలుసుకొని నేర్చుకోవడానికి సిద్ధపడుతుంది. ఈ రచనలో సంభాషణల ప్రాధాన్యత ఎక్కువ ఉండటం వల్ల కథకు ఉండాల్సిన 'బిగువు' కొంత తక్కువగా కనిపిస్తుంది.

**ధనత్రయోదశి...** డా.దార్ల వెంకటేశ్వరరావు తన 'వీచిక' (సాహిత్య విమర్శ) గ్రంథంలో ఈ కథను విశ్లేషించారు. దీని కథా వస్తువు చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

"వేంకటరత్నం అనే ధనవంతుడు తన తల్లిదండ్రుల వల్ల పేదరికంలో కూరుకుపోతాడు. ఉన్నత విద్య అభ్యసించే స్తోమత లేక, కుటుంబాన్ని పోషించడం కోసం ఒక షాపులో గుమస్తాగా చేరుతాడు. ఆ షాపు యజమాని (వేంకటశెట్టి), మరో ఉద్యోగి (కృష్ణమూర్తి) కలిసి వేంకటరత్నం నిజాయితీని పరీక్షించడమే ఈ కథా ఇతివృత్తం. దీపావళి సమయంలో దారిద్రాన్ని పోగొట్టుకోవడానికి యజమానికి తెలియకుండా కొంత ధనాన్ని అపహరిద్దామని సహోద్యోగి ప్రేరేపించినా వినకపోవడంతో, బలవంతంగా వంద రూపాయలను వేంకటరత్నం జేబులో పెడతాడు. ఆ డబ్బుతో ఇంటికొచ్చిన వేంకటరత్నం, భార్యకు ఆ విషయం చెప్పలేక నిద్రపట్టక తల్లడిల్లుతుంటాడు. అర్ధరాత్రి ఆ డబ్బును చూస్తుండగా భార్యకు మెలుకువ వస్తుంది. మర్నాడు ఇద్దరూ కలిసి ఆ డబ్బును యజమానికి తిరిగి ఇచ్చేస్తారు. అది తాను పెట్టిన పరీక్షేనని, ఆ పరీక్షలో దంపతులిద్దరూ నెగ్గారని మెచ్చుకుని యజమాని వారికి జీతం పెంచుతాడు." (పుట: 137)

**విశ్లేషణ:**విమర్శకురాలు సత్యవతి గారన్నట్లు, ఈకథా నిర్మాణం పటిష్టంగా ఉన్నా, ఇందులో భార్యాభర్తలలో దైవభీతి ఎక్కువగా కనిపిస్తుంది. యజమానికి తెలిస్తే ఉద్యోగం పోతుందన్న భయం, నిస్పృహాయత వారిలో వెల్లడయ్యాయి. అయినప్పటికీ, పిల్లల పట్ల, సమాజం పట్ల వారికున్న మానవీయ ఔన్నత్యం చక్కగా వర్ణించబడింది. విజయలక్ష్మి, వేంకటరత్నం వంటి పాత్రల పేర్లు సంప్రదాయ భావజాలానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ కథ గ్రాంథిక భాషలో ఉన్నప్పటికీ, శిల్ప పరంగా చాలా పటిష్టంగా సాగింది.

సమగ్రంగా పరిశీలిస్తే, తెలుగు కథానిక ఆవిర్భావ వికాసాల్లో బండారు అచ్చమాంబ గారి కృషి అద్వితీయమైనది. ఆధునిక కథా లక్షణాలు 'దిద్దుబాటు'లో పరిపూర్ణంగా కనిపిస్తున్నాయని విమర్శకులు భావించి నప్పటికీ, అంతకుముందే అచ్చమాంబ గారు తన కథల ద్వారా స్త్రీ విద్య, నిజాయితీ, సామాజిక సంస్కరణ వంటి ప్రగతిశీల అంశాలను వెలుగులోకి తెచ్చారు. కథా వస్తువులో వైవిధ్యం, పాత్రల చిత్రణలో సహజత్వం, సామాజిక స్పృహ వంటివి ఆమెను తొలి తెలుగు కథా రచయిత్రిగా నిలబెట్టాయి. ప్రాంతీయ వాదాలు, శిల్పపరమైన చర్చలు ఎలా ఉన్నా, తెలుగు కథా సాహితీ వనంలో తొలి మొలకలుగా అచ్చ మాంబ గారి రచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయి.




డి. సాయినాథ్ రెడ్డి
6305584064

నినాదం
నిఖార్సైన జర్నలిజం
అదివారం, మార్చి 8, 2026

# సాహితీ లహరి

ఉమెన్స్ డే స్పెషల్..

"సమానత్వం, సమానత్వం అంటూ ఉంటే నా చిన్నిబుద్ధికి అదే అందకుండా ఉంది. ఆనకుండా ఉంది. అర్థం కాకుండా ఉంది నాకు. ఒక వేళ పురుషులు పురుషులకి పుట్టినట్టయితే, స్త్రీలు స్త్రీలకు పుట్టినట్టయితే సమానమనడంలో అర్థం ఉంది. అట్లా కాదే... సృష్టే సృష్టిని ఆడవారి చేతిలో పెట్టింది. అంటే సృష్టే సృష్టి అంటే దేవుడనే వాడు ఒకడుండి సృష్టిని సృష్టించి ఆ సృష్టిని ఆడవాళ్లకి పెట్టిందని నా దృక్పథం. కనుక ఆడవారికి జన్మ ఆడదే ఇస్తుంది. మగవారికి జన్మ ఆడదే ఇస్తుంది. మరి శరీరంలో ఉండే రక్తమాంసాలన్నింటిని కరిగించి వారికి జన్మనిచ్చే ఆడది గొప్పదా? జేబులో చేతులు పెట్టుకొని తిరిగే మగవాడు గొప్పవాడా? కనుక నా దృక్పథంలో... నా దృక్పథంలోనే కాదు అది యదార్థం, సత్యం, ఒప్పుకొని తీరాల్సిందే సమాజం ఒకరోజు.' అని తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రముఖ రాజకీయవేత్త, జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసిన టి.ఎస్. సదాలక్ష్మి తన అభిప్రాయాన్ని వివిధ ప్రసంగ సభల్లో బహిరంగంగానే ప్రస్తావించారు. ఈ విషయం నల్లపొద్దు సంకలనంలో ప్రచురించ బడింది. (ఆమె 1952 సాధారణ ఎన్నికలలో కరీంనగర్ లోని సుల్తానా బాద్ పార్లమెంట్ నియోజ కవర్గం నుండి రిజర్వుడు సభ్యురాలిగా పోటీచేశారు).

వెనకకు నెట్టబడి నెట్టబడి
నేను శతాబ్దాలుగా
రోగగ్రస్త స్తన్యాన్ని
కుడుస్తున్న శాపగ్రస్తను
కూటికి గుడ్డకే కాదు
బ్రతికే హక్కును కోల్పోతున్న
గంధర్వ పతులు లేని సైరంధ్రిని
కొత్త కలలు కంటున్న త్రిజటని
జండర్ అంటే వర్గం కాదని
రాయితీలు రిజర్వేషన్లు
మనకు చెందబోవడం లేదని
కొత్త కాంక్షకాని పాత అవసరాన్ని
నిజం చేసుకోవటానికి
చట్టం చెయ్యి కాల్చక ముందే
ఆకులు వెదకాలి రండి"
- జ్వలిత



"She is not born, She is made" (స్త్రీ స్త్రీగా పుట్టదు. స్త్రీగా తయారు చేయబడుతుంది.) అని ప్రముఖ ఫ్రెంచ్ అస్తిత్వవాద తత్వవేత్త, రచయిత, స్త్రీవాద సిద్ధాంతకర్త సిమోన్ డి బ్యూవోయిర్ (Simone de Beauvoir) 1949లో రాసిన 'ది సెకండ్ సెక్స్' (The Second Sex) గ్రంథంలో తెలియజేశారు. ఈ నినాదమే అసలైన స్త్రీవాదానికి లేదా స్త్రీ సాధికారతకు తెరతీసింది. ఆమె చూపిన ఉద్యమ భావజాలం పునాదిగా చేసుకొనే ప్రపంచ వ్యాప్తంగా మహిళా పోరాటాలు ఉధృతమైనాయి. సెక్స్- జండర్ మధ్య వ్యత్యాసముంది. సెక్స్ పుట్టుకలో శారీరకంగా పురుషుల మధ్య ఉన్న అవయవ నిర్మాణంలో ఉన్న తేడా సెక్స్. జండర్ బాల బాలికలు పెరిగే కొద్ది అలవాట్లలో, ఆచారాలలో, నీతులలో ఆపాదిస్తున్న తేడా. పితృస్వామ్యం, లింగ వివక్ష స్త్రీవాద అస్తిత్వ ఉద్యమంలో ప్రధాన అంశాలుగా నిలిచాయి.

**పితృస్వామ్యం:** వందల సంవత్సరాలుగా సమాజంలో పురుషుడితే అధికారం, అన్ని రంగాల తోపాటు సమాజానికి కేంద్ర బిందువుగా నిలిచిన కుటుంబంలో కూడా పురుషుడిదే అధికారం అన్న న్యాయం కొనసాగుతూ వస్తుంది.

**లింగవివక్ష:** పితృస్వామ్య సమాజం నడవడికను, నీతులను, సూత్రాలను, ధర్మాలను విడివిడిగా నిర్దేశించింది. దుస్తులు, అలంకరణ, ఆటలు, పాటలు ఇంటా బయట చేయవలసిన పనులు, వివాహం వంటివి విడివిడిగా నిర్దేశించబడ్డాయి.

**ఫెమినిజమ్ (Feminism):** అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా తెలుగులో వాడుకలో ఉన్న శబ్దం "స్త్రీవాదం". మానవ సమాజంలోని సగభాగమైన స్త్రీలు లైంగిక వివక్ష కారణంగా అణచివేతకు గురి అవుతూ పురుషుల కంటే తక్కువ సాంఘిక స్థితిలో ఉండడాన్ని ప్రశ్నిస్తూ స్త్రీ విముక్తిని కాంక్షిస్తూ అభివృద్ధి చెందిన సిద్ధాంతం.

పితృస్వామ్య వ్యవస్థకు, సాహిత్యానికి మధ్య ఉన్న సన్నిహిత సంబంధాన్ని గుర్తించడం, పితృస్వామ్య సమాజాన్ని ధిక్కరించడం స్త్రీవాద కవిత్వంగా భావించవచ్చు. స్త్రీ అస్తిత్వం, ప్రయోజనం వంటి వాటిని పునాదిగా చేసుకొని, తదనంతరం స్త్రీవాదం బలంగా ముందుకొచ్చింది. సంస్కరణ, జాతీయోద్యమాలు, అభ్యుదయ, విప్లవ చైతన్యాల నుండి మార్పుకు అనువైన నేపథ్యాన్ని ఏర్పరుచుకొని స్త్రీలు ముందుకొచ్చారు. స్త్రీవాద కవిత్వాన్ని వెలువరింపజేశారు. ఈ ఉద్యమాలు స్త్రీలలో ఒక సిద్ధాంతపరమైన ఆలోచనాశక్తి, ప్రాపంచిక జ్ఞానం, పోరాట స్ఫూర్తి, ఉద్యమ భావజాలం పెంపొందింపజేశాయి. స్త్రీవాద సాహిత్యం 1975 తర్వాతనే ఒక నిర్దిష్టరూపాన్ని దాల్చింది. 1975 కంటే ముందున్న సాహిత్యం కూడా స్త్రీ చైతన్యం, స్త్రీ అభ్యుదయం మీద వెలువడింది. తెలుగులో వచ్చిన మొదటి ప్రక్రియ 'కవిత్వం'.

కవితా ప్రక్రియ ద్వారా స్త్రీవాద అస్తిత్వ ఉద్యమం ఒక సమగ్రమైన రూపాన్ని ఏర్పరచుకొని, విస్తృతమైన నేపథ్యాన్ని సంతరించుకొంది. ఆధునిక తెలుగు కవిత్వం స్త్రీ సమస్యలలోని రాజకీయ స్వభావాన్ని గానీ, పితృస్వామ్య భావజాల మూలాలను గానీ, జండర్ రాజకీయాలను గానీ లోతుగా అధ్యయనం చేశాయి. స్త్రీవాద రూపురేఖల్ని బహుముఖాలుగా విస్తరింపజేశాయి.

స్త్రీవాద కవితా ధోరణులతో ఓల్గా వెలువడిన కవితా సంకలనం 'నీలిమేఘాలు'. 1972-92 మధ్యకాలంలో రచించబడినవి ఇందులోని కవితలు. వీటికంటే ముందుగానే 'మాకు గోడలు లేవు', 'మూడుతరాలు', 'సవాలక్ష సందేహాలు', 'మనకు తెలియని మన చరిత్ర' వంటి పుస్తకాలు వెలువరింపబడ్డాయి. స్త్రీవాద కవిత్వం ప్రదర్శించిన వస్తుతత్త్వం సాహిత్యాన్ని విభిన్నమైన కోణాల్లో నిలబెట్టాయి.

# తెలంగాణ స్త్రీవాద కవిత్వం

# సాధికారత

ఆచార్య త్రివేణి వంగరి
తెలుగు శాఖ,
హైదరబాద్ విశ్వవిద్యాలయం,
గచ్చిబౌలి : 500046
Mobile: 9951444803



**స్త్రీవాద కవిత్వాన్ని ప్రభావితం చేసిన అంశాలు :**

- శరీరం, శరీర రాజకీయాలు, సౌందర్యాత్మకహింస
- స్త్రీ, పురుష సంబంధాలు, లైంగిక స్వేచ్ఛ
- భావజాల రూపంలో స్త్రీలు చేసే చాకిరి, శ్రమ
- స్త్రీలు అనుభవిస్తున్న వేదనలు, భ్రూణహత్యలు, అబార్షన్
- మాతృత్వం, రజస్వలకావడం
- లైంగిక దోపిడి, అత్యాచారాలు, వ్యభిచారాలు
- గృహహింస, వరకట్న సమస్య, లైంగిక వేధింపులు
- పునరుత్పత్తి శక్తి, అస్తిత్వ పునర్వివేచన
- స్త్రీ జీవితంలోని 'ఆర్థికం', ఆర్థిక స్వావలంబన
- కవిత్వంపై దాడి, అణచివేత పట్ల తిరుగుబాటు

- నీలిమేఘాలు

తెలంగాణలో వివిధ అస్తిత్వ ఉద్యమాలలో స్త్రీవాదం బలంగా ప్రస్ఫుటమవుతుంది. ఈ కాలంలో స్త్రీవాద సాహిత్యం బహుముఖాలుగా విస్తరించింది. వచన కవిత్వంలో స్త్రీవాద భావజాలం కులమత అస్తిత్వాలకు ప్రాతిపదికంగా నిలిచింది. విభిన్న కవిత్యోద్యమాలు స్త్రీవాదంలో చోటుచేసుకున్నాయి. పితృస్వామ్య వ్యవస్థను ధిక్కరిస్తూ వచ్చిన స్త్రీవాదకవిత్వంలో దళిత స్త్రీవాదం, మైనారిటీ స్త్రీవాదం, బీసీ స్త్రీవాదం వంటివి ప్రవేశించాయి. అదేస్థాయిలో స్త్రీల మీద జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలపై ధిక్కారం కవిత్వంలో బలమైన గొంతు కగా మారాయి. అనిశెట్టి రజిత పితృస్వామ్య సంస్కృతి మీద తన కవితలతో తిరుగుబాటు చేశారు. స్త్రీల జీవితాలు ఏ విధంగా శాసింపబడుతున్నాయో, సంప్రదాయం ఆచారాలు, సనాతన సంస్కృతికి హేతువులైన స్త్రీల ప్రాతినిధ్యాన్ని ఆమె ఒక విధంగా ఖండించారు. స్త్రీల జీవితాలు ఈ కాలంలోనే బానిస స్థితిలోకి దిగజార్చుతున్నాయని ఆమె ఆరోపించారు. ఆమె కవితా సంపుటిలో 'గులాబీలు జ్వలిస్తున్నాయి'. 'నేనొక నల్లమబ్బునవుతా', 'చెమట చెట్టు', 'ఉసురు', 'అనగనగా కాలం', 'నిర్భయాకాశం కింద' వంటివి పురుషాధిపత్య సమాజంపై ధిక్కార స్వరాన్ని పలికించినవి. ఈ సందర్భంలోనే అనిశెట్టి రజిత రచించిన కవిత్వం 'అవును మౌనాన్ని మాట్లాడుతున్నాను". "నిత్యగాయాల జ్యోతిలా మండుతూ, ఉద్యమ భాషపై మాట్లాడుతున్నాను". అంటూ ఆక్రోశాన్ని ప్రకటించారు. "ఉద్విగ్న, జిగర్" వంటి కవితా సంకలనాలకు సంపాదకత్వం వహిం చి రుద్రమ ప్రచురణల పక్షాన ప్రచురించారు. "నిర్భయాకాశం కింద" కవితా సంపుటిలో స్త్రీల జీవితంలో గల ఆశను, ఆకాం క్షను పెంపొందింపజేశారు. నిర్భయ చట్టం అమలు, పునరావాస కేంద్రం, పనితీరు పట్ల ప్రత్యేక శ్రద్ధను తీసుకొని సక్రమం గా నిర్వహించే విధంగా చర్యలు, సూచనలు చేశారు. నిర్భయ చట్టంలో డొల్లతనాన్ని, ఆ చట్టం వచ్చికూడా అత్యాచారాలు ఆగకపోవడాన్ని ఆమె నిరసించారు. నిర్భయాకాశం కింద శరీర సౌందర్యం, పురుషాధిపత్య ధోరణి, బానిస బతుకు, చిత్రహింసల జీవనం, అణగారిన జీవనఛాయ, సుఖతత్త్వం వంటి భావ జాలం నుండి విప్లవ పిడికిళ్ళు ఎత్తిన చేతుల వరకు పరోక్ష పోరాటం చేసింది. అందులోని ఒక ఖండిక 'గులాబీలు జ్వలిస్తున్నాయి'.

"చలింపజేసే సౌందర్యం తమ సొత్తని
మత్తెకించే మాధుర్యం తమ నైజమని
అనుభూతీ అనుభవాలే తమ ఉనికియని
మృదువైన తాజా స్పర్శతో
తన్మయులజేసే ఆ పూతా...
చిదిరి వేయబడిన అత్తరు కావడమే
వాటి జీవిత ధ్యేయం కాబోలని
అందరివలె నేనూ భావించిన - ఆ రోజులో"



ఆడజన్మ మీద ఉన్న ఆంక్షలు, స్త్రీ ఒక సౌందర్యరాశిగానో, శరీర కాంక్షను తీర్చే ఒక మోహనాంగిగానో భావిం చే స్థితి నుండి బయటపడాలనే ఒక ఉత్తేజం, చైతన్యం మనకు కనిపిస్తుంది. దేశం కట్టుబొట్లు, సనాతన ఆచారాల వల్ల ఆడపిల్ల జన్మ మీదనే వక్రభాష్యం ఏర్పడిన స్థితిని ఆమె తన కవితల్లో పేర్కొన్నారు. ప్రపంచమంతా ఆడజన్మ పట్ల ఒక బానిస గొడుగు కింద నిరసిస్తుందని, స్త్రీవాదం సైద్ధాంతిక నేపథ్యంలో ప్రపంచ నిర్ణీత సందర్భాలు నిలిచి ఉంటాయని చిత్రీకరించారు. అది మనకు 'ఒక ఆడపిల్ల జన్మించిన వేళ!' అనే కవితలో తెలుపబడింది. ప్రపంచ ప్రమాదాల మీద ఏర్పడిన స్త్రీవాదానికి PURD రచించిన 'INSIDE THE FAMILY' అనే కవిత్వాన్ని అనువదించి అంతర్జాతీయ స్థాయిలో కవితా కోణాల్ని ఆవిష్కరించారు.

"నీవు పుట్టిన రోజున నా చిన్నితల్లి
ఓహ్ దేవుడా !
నా కడుపు లోయల్లోకి
ఏదో కూరుకుపోతున్న అనుభూతి
నీవు పుట్టిన ఆ రోజున నా చిన్నితల్లీ!
అది నీరసించిన చీకటిరాత్రి
నా అత్తా! ఆడబిడ్డా!
దీపాలు వెలిగించడానికి కూడా నిరాకరించారు
మరి నా పతిదేవుడూ! యజమాని!
నన్ను కఠినంగా ఏమేమో అన్నాడు
ఓహ్ నీ పుట్టుకకు వైభవం చేకూరనియ్
నా చిన్నితల్లీ!
ఆ సమయాన దేవుళ్ళంతా
ఈ భూమ్మీద నుండి వలసబోయారు"

జ్వలిత స్త్రీ, పురుష సంబంధాలలో ఉన్న డొల్లతనాన్ని ప్రశ్నిస్తూ ప్రగతిశీల భావజాల కవయిత్రిగా గుర్తింపు పొందినవారు. స్త్రీవాద కవిత్వానికి స్పష్టమైన రూపురేఖల్ని నిర్దేశించింది. సబ్బండ వర్ణాల స్త్రీల సమస్యలను, యాంత్రికీకరణ దాంపత్యం, కార్పొరేట్ మోజులోపడి కొట్టుమిట్టాడుతున్న కుటుంబాలు, ఆర్థిక వ్యవస్థ వంటివి స్త్రీ జీవితాలపై అనితర ప్రభావాలను చూపింది. కవిత్వం ఆ దిశగా దృష్టి సారించింది. జ్వలిత రచించిన 'కాలాన్ని జయిస్తూ నేను', 'సుధీర్ఘ హత్య', 'అగ్నిపాపి' వంటివి స్త్రీవాదాన్ని బలంగా చూపిన సంపుటాలు. ఆడ శిశువులు బాల్యంలోనే అనాథలుగా మిగిలిపోతున్న స్థితిని, దానికిగల పరిస్థితులను స్త్రీవాద కవిత్వం సమస్యా అన్వేషణ సాగించింది. దీనికి ఆర్థిక రాజకీయ కారణాలుగానే చిత్రీకరించే ప్రయత్నం సమకాలీన కవిత్వం చేసింది. అనాధ బాల్యంగా ఆడపిల్ల గడుపుతున్న జీవితం, ఆమెపై గల ఆంక్షలు సమాజం సృష్టించిందా? లేక పరోక్ష రాజకీయ ప్రతిబంధకమా? ఈ సమస్యను చాలా గట్టి గొంతుకలలో స్త్రీవాద కవయిత్రులు వెల్లడించారు. అనంతసాగరాల చెలియలికట్టలు అధిగమించే స్వేచ్ఛ లైంగికత్వం ఒక శిశువుని ఏ విధంగా అనాధగా మార్చుతుందో నేటి కవిత్వం చూపుతుంది. దీనినుంచి బాల్యపురోదన విశ్వమహిషి చెవిన వీణాగానంగా చిత్రీకరించింది. నాన్నమ్మల, అమ్మమ్మల అరణ్య రోదనగా నిలిచింది. 'బాల్యాన్ని పాతరేసిన చోట' జ్వలిత ఆక్రోశించిన కవిత. అత్యాధునిక యాంత్రిక యుగంలో సమాజంలో చోటుచేసుకున్న విషమ సంస్కృతి ఎంతటి వికృత పరిణామాలకు దారి తీస్తుందో స్త్రీవాద కవిత్వం స్పష్టం చేసింది. స్వేచ్ఛా లైంగికత, వివాహం కాకుండానే తల్లి కావడం, తల్లి వివాహిత కాకపోవడం, తల్లి సమాజం నుండి వెలివేయబడటం, 'సరోగసి' విధానం, 'గే' సంస్కృతి వంటివి ఆడ శిశువు పుట్టుకకు గుదిబండలాగా మారినాయి. ఆడపిల్లల కిడ్నాపింగ్, ట్రాపింగ్ వంటివి ఈ రోజుల్లో స్త్రీవాద కవిత్వానికి ఒక పెద్ద సవాలుగా మారింది. కవిత్వం ఆడ పిల్లలు కనుమరుగవుతున్న వైనాన్ని ప్రదర్శించింది. ఏకపక్షంగా ముక్తకంఠంగా కవయిత్రులు ఈ సమస్య మీద స్పందించారు. కిడ్నాప్, యాసిడ్ దాడి, అత్యా చారం, వేట కొడవళ్ళతో హత్య చేయడం, వరకట్న కోరల్లో చిక్కుకోవడం అంతర్జాతీయ స్థాయిలో రక్షణ చట్టాన్ని కబలిస్తున్న సమస్య "కిడ్నాపింగ్". "కనుమరుగవుతున్న నేను"లో జ్వలిత "నవ నాగరికత నగ్న నృత్యమాడుతున్నది కిడ్నాపింగ్ అంతర్జాతీయ క్రీడ" అంటూ ఎద్దేవా చేశారు. రాజ్య అలక్ష్యం, స్త్రీ రక్షణ మార్గంలో విబేధింపబడుతున్న రాజ్యాంగ చట్టాలు స్త్రీవాద కవిత్వానికి వస్తువులుగా మారాయి.

"అందమైన పువ్వులను / రెక్కలు రెక్కలుగా
ముక్కలు ముక్కలుగా / కుత్తుకలు కత్తిరించడం
కొత్త ప్రక్రియ ఇప్పుడు / యాసిడ్ బాంబులు
ఉగ్రవాదుల ఆయుధం / గతంలో ఆమ్ల జల్లులతో
అబలలను మార్చడం చూస్తున్నాం"

'స్త్రీకనుమరుగవుతుంది..!' ఈ హెచ్చరిక భవిష్యత్తు మానవ జన్మకు ప్రశ్నార్థకంగా మారింది. భారత జనాభా గణన ప్రకారం కొన్ని నిర్దేశిత ప్రదేశాలలో మగవారి కంటే ఆడవారి నిష్పత్తిరేటు తక్కువగా ఉన్నట్లు గుర్తించింది. ఈ సూచిక రాబోయే తరానికి హెచ్చరికగా భావిస్తుంది. అందుకే చెట్టు, చెరువులను సహజవనరులుగా ఏ విధంగానైతే కాపాడుకుంటున్నామో, సృష్టికి సహేతుకులైన స్త్రీలు కనుమరుగు కాకుండా రక్షించుకోవాలనే ఆకాంక్ష స్త్రీవాద కవిత్వం అంతర్గతంగా సూచించింది.



స్త్రీవాద కవిత్వం అంటే పురుషాధిపత్య సమాజంపై ధిక్కారస్వరం ప్రకటించడమే అవుతుంది. అనేక విధాలుగా స్త్రీపడుతున్న బాధ, వారిపై హింస, పీడన అది పురుషాధిపత్య భావ జాలం నుంచే కలుగుతుంది. కుటుంబ పెత్తనం నుండి రాజ కీయ వ్యవస్థ వరకు ప్రతి నిర్ణయాత్మకశక్తి పురుషుడి ఆధిపత్యంపైనే ఉంటుంది. పౌరహక్కులు, పంచాయతీ వ్యవస్థ, రాజ్యాంగ సవరణలు పురుషుడి భావజాలం దిశగా సాగుతున్నాయని స్త్రీవాదులు ప్రతిఘటిస్తున్నారు. రాజకీయ ప్రభావంతో ద్వంద్వవైఖరిని ప్రదర్శిస్తున్న వివిధ పార్టీలు, ప్రభుత్వం అన్నీ స్త్రీల హక్కుల మీద నీళ్ళు చల్లుతున్నాయని విమర్శించారు. జ్వలిత 'రోగగ్రస్త స్తన్యం' కవితలో...

"వెనకకు నెట్టబడి నెట్టబడి
నేను శతాబ్దాలుగా
రోగగ్రస్త స్తన్యాన్ని కుడుస్తున్నశాపగ్రస్తను
కూటికి గుడ్డకే కాదు
బ్రతికే హక్కును కోల్పోతున్న
గంధర్వ పతులు లేని సైరంధ్రిని
కొత్త కలలు కంటున్న త్రిజటని
జండర్ అంటే వర్గం కాదని
రాయితీలు రిజర్వేషన్లు
మనకు చెందబోవడం లేదని
కొత్త కాంక్షకాని పాత అవసరాన్ని
నిజం చేసుకోవటానికి
చట్టం చెయ్యి కాల్చక ముందే
ఆకులు వెదకాలి రండి"

అంటూ రాజ్యం మహిళలపై చూపుతున్న అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని స్త్రీవాద కవిత్వం దుయ్యబట్టింది. పార్లమెంట్లో మహిళా బిల్లును ఆమోదించలేకపోవడానికి రాజకీయంగా పురుష సంస్కృతి బలమైన ప్రభావాన్ని చూపుతుందని తెలియజేసింది. మహిళల రిజర్వేషన్లపై అవకతవకలకు పాల్పడడం, మహిళల ఆత్మగౌరవాన్ని, హక్కులను కాళ్ళరాయడమే అవుతుందని మండిపడింది. సంవత్సరాలుగా కొనసాగుతున్న రాజకీయ హక్కుల సాధన మీద పోరాటాన్ని అంతమొందించడానికి కుట్ర జరుగుతుందని, మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ఆంక్షలు ప్రతిబంధకాలు రాజకీయ పార్టీలు సృష్టిస్తున్నాయని ఖండించింది. సాలెగూళ్ళ లాంటి రాజ్యపాలన ఈ దుర్భర పరిణామానికి నిదర్శనం. 'కోటాలో కోటా లేదంటూ... కొల్లగొడుతున్న కొల్లాయి వాదం' అనేది మహిళా బిల్లుపై చూపుతున్న అవ్యక్త ప్రతిపాదిత కవిత్వం. పురుషాధిపత్య సమాజంలో ఆడవాళ్ళు ఎలా అవమానాలకు, అత్యాచారాలకు గురవుతున్నారో ఈ కవిత నిరూపిస్తుంది. రాజకీయ వ్యవస్థను తీవ్రంగా పరిగణిస్తూ, రాజ్యాంగం ఇచ్చిన హామీని నిలబెట్టుకోని సందర్భాలను గుర్తుచేశారు. స్త్రీల సంక్షేమం పట్ల రాజ్యవ్యవస్థ ద్వంద్వ వైఖరిని కవిత్వంలో వ్యతిరేకించారు. భండారు విజయ పురుషుడిలో అసందర్భంగా పుట్టే వికృత కామవాంఛను తన కవి త్వంలో చాలా గట్టిగానే ప్రతిఘటించారు.

"వాడికి ఒళ్ళంతా అంగాలే
వాడి మనసంతా రాటుదేలిన విషపు ముళ్ళే
వాడికి మనోవికారం ఎప్పుడు పుడుతుందో
వాడి అంగం ఎప్పుడు నిక్కబొడుస్తుందో
ఎప్పుడు మొనదేలి ఎగిరి పడుతుందో
ఎవరివైపు తిరిగి చీల్చివేస్తుందో
వాడిని చిత్రించిన వాడికి కూడా తెలియదు"


కొండపల్లి నీహారిణి తాను వెలువరించిన 'అర్ర తలుపులు', 'నిర్నిద్రాగానం', 'ఎనిమిదో అడుగు' సంపుటాలలో స్త్రీవాదంతో కూడిన కవితలు ఉన్నాయి. 'సమాజంలోని దాష్టీకాలని చూస్తే కవిత్వంగా కన్నీరు కారుస్తారు' అని చెప్పే నీహారిణి కవిత్వంలో సమకాలీన సమస్యల పట్ల స్పందన ఉంటుంది.

"కంచాల అంచులు వంగినట్లు
ఆమె అమ్మగా, ఆలిగా
వంగి వంగి వండి వారుస్తుంది"

'సూత్రధారులు – పాత్రధారి' కవిత ఎంతో ఆలోచనాత్మకమైన కవిత. స్త్రీ ఉనికికి సరైన గుర్తింపు లేదని, వంటిల్లు కేంద్రంగా స్త్రీ జీవితం గడిచిపోతుందనే బాధ వ్యక్తపరిచారు. మానవ సృష్టికి మూలమైన ఆమె ప్రతిభను గుర్తించేవారు కొరవడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. 'కల్తీలో ఒక జీవితం' కవితలో "నువ్వు సీసాలు ఖాళీ చేస్తుంటే /కన్నీటితో నింపుతుంది ఆమె" అని తాగుడుకు బానిసలై ఎన్నో కుటుంబాలలో ప్రశాంతత కరువైపోయే దయానియా స్థితిని చిత్రించారు.

తెలంగాణ నుంచి 'ధిక్కార' సంకలనాన్ని చంటి ప్రసన్న కేంద్రం ట్రస్ట్ వారు ప్రచురించగా.. ఇది అత్యాచారాలపై అగ్నిధార, అంకుశం సంధించి ఉరి బిగించిన ఘీంకారగా అభివర్ణించారు. 'ఉద్విగ్న' కవితా సంకలనాన్ని రుద్రమ ప్రచురణల ద్వారా వెలువరించారు. అత్యాచార భారతంపై ఓరుగల్లు కవుల నిరసనను ప్రకటించారు.

దళిత స్త్రీ వాదం : కులం పుట్టిన నాటి నుండి కుల పితృస్వామ్య పీడనకు గురి అవుతూ దళిత స్త్రీవాదం వెలువరింపబడింది. దళిత స్త్రీలు అనుభవిస్తున్న శారీరక, మానసిక హింసను కవిత్వంగా నివేదించారు. స్త్రీవాదం జండర్ వర్గంతో పోరాడితే దళిత స్త్రీవాదం జండర్ వర్గంతో పాటు కులవర్ణాలను కూడా ఎదురుకోవలసి వచ్చింది. సాంఘిక ఆర్థిక సామాజిక అంశాలను జండర్ దృక్ప థంలో దళిత స్త్రీవాద ఉద్యమానికి అనుసరణీయంగా నిలిచాయి. ఈ నేపథ్యంలోనే దళిత స్త్రీవాదం ఒక సాహిత్యంగా బయటపడింది. దళిత కవయిత్రుల జండర్ స్పృహకు శతాబ్దాల పోరాటాలలో చాలా దగ్గరి సంబంధం ఉంది. సామాజిక ఉద్య మాలు, దళిత పోరాటాల ఉద్యమం నుంచి నేటి ఆత్మగౌరవ ఉద్యమాలు, దళిత మానవ హక్కుల ఉద్యమాలు, వాటి లక్ష్యా లు, లక్ష్యసాధనకు అవి అవలంభించిన విధానాలు, వాటి భావజాలాలన్నీ కూడా దళిత కవయిత్రులు



తమ భావాలను వ్యక్తీకరించడానికి నేపథ్యాన్ని అందించాయి. గోగుశ్యామల, జాజులగౌరి, జూపాక సుభద్ర, చల్లపల్లి స్వరూపారాణి, మేరీ మాదిగ వంటివారు వర్తమాన దళిత స్త్రీవాద కవిత్వాన్ని వెలువరిస్తున్నారు. 'మాకు గోడలు లేవు' అన్న స్త్రీవాదులు కులం గోడలను వదిలిపెట్టలేకపోయిన స్థితిని దళిత స్త్రీవాదులు ఎత్తిచూపారు. దళిత స్త్రీ తాము తమ కుటుంబ పురుషాధిపత్య సమాజం నుండి గాక, అగ్రవర్ణ స్త్రీల ఆధిపత్యం నుండే పీడన, హింస ఎదుర్కొంటున్నామని వారి వాదన. కారంచేడు, చుండూరు సంఘటనల నేపథ్యం వారి దళిత స్త్రీవాదానికి బలమైన భూమికను ఏర్పరిచింది. నీలిమేఘాలలో ప్రచురింపబడిన కవితల పట్ల అసహనం ప్రకటిస్తూ జూపాక సుభద్ర 'చీర కొంగు' దళిత స్త్రీలకు ఎంత ఉపయోగదాయకమో 'కొంగు నా బొబ్బె మీద కావలుండే బొంతపేగ్గాదు' దళిత స్త్రీవాద నేపథ్యంలో కవితను వెలువరించారు.

"కొంగు నా ఆకలిని ముడేసుకొని
నా గడుపు కర్సుకొని
కట్టమీని మైసమ్మోలె కావలి బంటది
కూలినాలికి నేను సెమట కాల్వనైతే
పిల్లగాలై అద్దుకుంటది
కాయగడ్డలకు, గాసం
గింజలకు కోమటి దినుసులకు
సుక్కల్ని పాదుపుకున్న సందమామోలె
నా నెత్తిన మూటై మెరస్తది
సేండ్లల్ల సెల్కల్ల అలిసి సొలిసి పుల్ల సీలితె
పక్క బట్టై పుర్సతిస్తది"

దళిత స్త్రీ చైతన్యాన్ని తెలిపే కవితలు అనేకం ఉన్నాయి. స్త్రీవాదులు దళిత కోణంలో అణగారిన జాతి విముక్తి కోసం స్పష్టమైన పోరాట స్ఫూర్తిని చూపారు.

మైనార్టీ స్త్రీవాదం : దళిత స్త్రీల తిరుగుబాటు విధంగానే ముస్లిం మైనార్టీ స్త్రీలు నిరసనలు ప్రకటించారు. ముస్లిం కవయిత్రులు తమ సంస్కృతిలో ఉన్న స్త్రీ అవిద్య, బుర్ఖ, తలాక్, గృహ హింస వంటి సమస్యలకు స్పందించి కవిత్వం వెలువరించారు. మత శక్తుల దాడులను, స్త్రీల మీద జరిగే అత్యాచారాలను ఖండించారు. షహనాజ్ ఫాతిమా, షాజహానా, షంషాద్, యాస్మిన్ బేగం, జరీన్ బేగం, జాకేరా, ఎం.ఎస్. బేగం, రజియాసుల్తానా వంటి కవయిత్రులు కవిత్వం రచించారు. ముస్లిమేతరులైన రాజ్యలక్ష్మి , గీతాంజలి వంటివారు ముస్లిం స్త్రీవాద కవిత్వం రచించారు. షాజహానా రచించిన 'అమ్మ నవ్వేది నాన్న' కవితలో ముస్లిం స్త్రీల ఆవేదన కనిపిస్తుంది. సామాజికంగా, ఆర్థికంగా చితికిలబడిన ముస్లిం కుటుంబాలలో ప్రతి ముస్లిం గృహిణి అనుభవిస్తున్న స్థితి కళ్ళకు కడుతుంది.

"నాన్న... నాన్న...!
అమ్మ మొహంలో జీవం లేదేం?
ఎప్పటిదో...
మీ ఇద్దరి బ్లాక్ అండ్ వైట్ ఫోటోలో
అమ్మ నెలవంకలా నవ్వుతుంటే
ఎంతందంగా నవ్వుతుందో...!
మళ్ళీ ఒకసారి అమ్మని నవ్వమని
అచ్చం అలానే నవ్వమని చెప్పవా...!
ఇప్పుడిక ఎవరూ అలా నవ్వలేరు
రేష్మా నవ్వింది చిన్నప్పుడు కల్తీ లేని నవ్వు
ఇప్పుడు దానికి ఇరవయ్యేళ్ళు
అప్పటికీ ఆ నవ్వులో ఎన్ని రంగులో కలిపి
దాన్నవ్వు అది మర్చిపోయింది
అందరం ఎక్కడ మర్చిపోయామో...!
ఇన్ని నవ్వుల్ని ఒక్క దగ్గరే పోగేస్తే ఎలా ఉంటుంది
స్వర్గం అంటారే... అది కనబడదు!!
కానీ ఇలాంటి స్వర్గాలు నీకక్కర్లేదు నాన్నా!
నీకు పక్కింటి ఆంటీ నవ్వు కావాలి
ఖాదర్ బీ డబ్బు కోసం నవ్వే కక్కుర్తి నవ్వు కావాలి
ఆ ప్లాస్టిక్ నవ్వులకు పాకులొడ్డం
అలవాటైన నీ కళ్ళకి...
అమ్మ నవ్వు రెక్కరాల్చుకుందని గానీ
అమ్మమనసు కన్నీళ్ళు రాలుస్తుందని గానీ
అక్కర్లేదు నాన్నా..."

ముస్లిం కుటుంబాలలో ఉన్న బహుభార్యత్వం, బుకఖా పద్ధతి, అసంఖ్యాక సంతానం, పేదరికం, గల్ఫ్ వలసలు, ముస్లిం ముసల్మాన్ వృద్ధులలో ముస్లిం బాలికల షాదీలు, తలాఖ్ వ్యవస్థ, పురుషాధిపత్యం, పితృస్వామ్యం వంటివి కవితా వస్తువులుగా ముస్లిం స్త్రీవాద కవిత్వం వెలువరింపబడింది.

స్త్రీవాదం అంతిమ లక్ష్యం పురుషాధిపత్య సమాజంపై తిరుగుబాటు ధోరణిని వహించడం. అది తెలుగు కవిత్వంలో బహిర్గతమైంది. జండర్ అసమానతలను తుడిచి వేస్తూ లింగవివక్షతను స్త్రీవాదులు నిరసించారు. సమానత్వ భావనను కల్పించడమే స్త్రీవాద సాహిత్యం ప్రధాన ధ్యేయం. మహిళా సాధికారతకు, స్వేచ్ఛా, సమానత్వం, ఆర్థిక స్వావలంబన కోసం ప్రయత్నం చేయడం కూడా ఒక అంశమే. స్త్రీ అనుభవం, మనస్తత్వ నిర్దే శాల మూలంగా స్త్రీ అభ్యున్నతిని కాంక్షించారు. స్త్రీ, పురుషుల సంబంధం శారీరకమైందా? సామాజికతకు కొలబద్దగా నిర్ణయించబడిందా? స్త్రీవాదం అధ్యయనాలు జరిపింది. రాజకీయ, అధికార సంబంధాలు, ఆలోచనలు, ఆచరణ విధానాలు స్త్రీవాదాన్ని విషవలయంలోకి నెట్టివేశాయి. ఆర్థికంతో ముడిపెట్టాయి. పర్యవసానాల పునర్విశ్లేషణలో స్త్రీవాద అస్తిత్వ ఉద్యమం పురోగమించింది.



# నినాదం
నిఖార్సైన జర్నలిజం

# సాహితీ లహరి

ఆదివారం 8-03-2026



## ఐకమత్యమే మహాబలమని చాటిన రంధి నవల

**ఆచార్య కొలకలూరి ఇనాక్ రచించిన రంధి నవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక మరియు సంస్కృత సమితి వారి ముద్రణ. ఇది 298 పేజీల సుదీర్ఘమైన నవల 27 అధ్యాయాలు. కొలకలూరి ఇనాక్ అనగానే మనకు ముందుగా గుర్తొచ్చేది ఊరబావి కథ. కథకుడు అనగానే ఊరబావి చదివావా అనే ప్రశ్న వినబడుతుంది. ఇప్పుడు మనము "రంధి" నవలలోకి ప్రవేశిస్తే, ఒక సజీవ దళిత (మాదిగ) పల్లె, గుంటూరు జిల్లా, తెనాలి తాలూకా వేజెండ్లగ్రామ ముఖ చిత్రం. అందులోని అగ్రవర్ణ, మరియు మాదిగల బతుకు చిత్రం తెలియజేసే మహత్తరమైన కథే రంధి నవల. పల్లెంటే మాదిగ పల్లె. ఊరంటే అన్ని జాతులు కులాల, మతాల కల గూరగంప ఊరి నేపథ్యాన్ని చక్కగా నిర్వచించారు రచయిత.**

ఆ పల్లెకు ఆనుకొని ఒక తాటితోపు. అది ఏనాటిదో విశాలమైనది. అక్కడ పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తుంటాయి. ఇక్కడ తాటితోపు కుక్కలు, పందులు, మనుషులు, బహిర్భూమి, ఉదయకాలపు సూర్యుడు. గురించి కవి వర్ణన అద్భుతం. గ్రామ కఠం నుండి సింహభాగం వరకు గ్రామాన్ని కవి తన కలంలోకి తీసుకున్నాడు. గ్రామాన్ని తాడుచుట్టిన బొంగరంలా తిప్పాడు రచయిత కొలకలూరి ఇనాక్. ఇంకా సూర్యోదయం కాలేదు, కానీ తూర్పు లేత తెలుపు రంగు ముఖానికి పులుముకొంది. మిగతా దిక్కులన్నీ నల్లగానే ఉన్నాయి. పెళ్ళి పందిట్లో మనుషులు కనిపించేంత తెలుపు, ముఖాలు గుర్తుపట్టనంత నలుపు కలగలసి ఉన్నాయి. ఇది రచయిత వర్ణనాతీతం. ఇనాక్ గారి రచనా నైపుణ్యం. మాదిగపల్లె, మాదిగ జీవిత నేపథ్యం పెళ్ళి, పేరంటం వారి సాంప్రదాయంని గొప్పగా మలిచాడు రచయిత. ఎందుకంటే రచయిత స్వయంగా మాదిగ కాబట్టి, అనుభవించిన జీవితాన్ని రాయడం కొంతలో వెసులుబాటు ఉంటుంది.

పెళ్ళి కూతురు సువ్వి, పెళ్ళి పందిట్లో పడుకొని తనకు శత్రువు వలన హాని ఉందని మరిచి ఒంటరిగా, ఒక్కర్తే బహిర్భూమికి వెళ్ళడం. శత్రువు రాముడి రూపేణా మాటు వేసుండటం, సువ్వి ప్రాణమున్న శవంలాగ ఉంది. తాటి తోపులో విసర్జించి రావలసిన మురికిని ఇంటికి తెచ్చుకున్నట్లు కనిపించింది సువ్వి, సువ్వి శరీరమంతా, గాట్లు, కదుములు గాయాలు ఒళ్ళంతా ఉన్నాయి. స్పృహతప్పిందాకా కొట్టినట్లుంది. అయినా చివరిదాకా ప్రతిఘటించి తన మానాన్ని కాపాడుకునే ప్రయత్నాన్ని రచయిత కళ్ళకు కట్టినట్టు ఒక దృశ్య రూపాన్ని పాఠకుల ముందుంచాడు.

సువ్వి కొట్టిందని చెబితే అవమానమని భావించి, మాదిగ దానితో గొడవైందని అన్నాడు రాముడు. గ్రామ పెత్తందారి ఊరి మోతుబరి అదిన్నూకాక సువ్విని మానభంగానికి శతవిధాల ప్రయత్నించి రాముడి తండ్రి నాంచారయ్య మాదిగపల్లెలోని కోటిగాడిని కోటయ్య ఇంటికి పోదాం అన్నందుకు సువ్వీ తండ్రి కోటిగాడు మాదిగ పెద్దలు ఉబ్బి తబ్బిబ్బయ్యారు. కోటి కుటుంబమేకాదు మాదిగి పల్లెంతా వణికి సచ్చేది. అలాంటిది నాంచారయ్య మాదిగ పల్లెలోకి అడుగు పెట్టి కోటి వాళ్ళ ఇంట్లో నులక మంచాల మీద కూర్చున్న సన్నివేశాన్ని రచయిత రక్తి కట్టించాడు. "మాదిగ యువతి సువ్వికి అగ్రవర్ణ రాముడికి ఆదిపత్యపోరు జరిగింది. సువ్విని బలవంతంగా లొంగదీసుకొని అనుభవించాలని రాముడు, రాముడనే మూర్ఖుడికి ఏమాత్రం లొంగగూడదనే ఆత్మభిమానం, ఆత్మగౌరవం సువ్విది. ఈ పోరాటంలో ఆఖరికి మాదిగ యువతి సువ్వే గెలిచింది. రాముడనేవాడు ఓడిపోయి చచ్చిపొయ్యాడు. కుల సాంప్రదాయం, కుల కట్టుబాట్లు చాలా గొప్పవి. ఎంత తక్కువ కులమైన ఎవడికులం వాడికి గొప్ప. వాడి కులం వాడితో వియ్యమందుకో




వాలనుకుంటారు. కోటిది అదే ఆలోచన. చందిరి తాత, ము త్తాతలు ఎవరో తెలి యదు. అట్లాంటప్పుడు చందిరి కుల మెట్లా తెలుసుద్ది అంటాడు కోటి, మాదిగ పెద్దలతో. ఆ సన్నివేశాన్ని కళ్ళకు కట్టినట్టు చిత్రించాడు రచయిత. చందిరి మూగవాడే కానీ, మనసున్నవాడు. వాడికి చందిరికి బైరాగి తోడుగా నేనున్నాను అంటు నిలబడ్డాడు. నా మనవడు చందిరికి నీ కూతుర్ని ఇచ్చి పెళ్ళి జరిపించమని కోటిగాడిని నిలదీసి అడిగాడు. సువ్వి చందిరి పెళ్ళి విషయంలో బైరాగి తన వంతు పాత్ర పోషించే విధానం రక్తి కట్టించాడు రచయిత. తనను కొట్టి అవమానించినందుకు రాముడు సువ్విని తనకుటుంబాన్ని, లేదా ఒక్క సువ్వీనైనా చంపి తీరాలని కంకణం కట్టుకొని శత విధాలు ప్రయత్నం విఫలమైన తీరు రక్తికట్టించాడు రచయిత. భాష ఆహతమయినా, అనాహతమైనా ప్రయోజనకారే, ప్రపంచ సాహిత్యం మొత్తం మనుషుల అవసరాల సృష్టి, ప్రపంచ మౌనం పరమార్థం సాధకం. కవి మాటల మూట. మౌని శబ్దపు ఊట. శబ్దం మధ్య భూగోళం తిరుగుతుంది. విశ్వ రహస్యం ఉంది. నిశ్శబ్దశక్తి రాముణ్ణి బలహీనుణ్ణి చేసింది అని చక్కని భాషా నైపున్యాణ్ణి చాటారు రచయిత. నవల అంతట్లో ఒకే అర్థాన్ని ఇచ్చే మూడు పదాలను తరుచుగా వాడాడు రచయిత. సాంద్రీభూతమైన, శక్తిమంతమైన పటిష్టమైన, అభేద్యమైన ఏదైనా ఒక సంఘటననో, సందర్భాన్నో చెప్పేటప్పుడు ఆ పదానికి బలము చేకూర్చేటప్పుడు రచయిత నొక్కి వక్కాణించడం అద్భుతంగా ఉంది.

ఈడుతోడు గుద్దినట్టు సరిపో యిందంటారు మాదిగి పెద్ద లు. దళిత బిడ్డలు చదువు కోవడమే ఒక విప్లవం. తట్టా, బుట్టా పట్టుకొని రైతు చేలోకి కూలి, నాలీ చేయకుండా, ఉన్నంతలోనే పుస్తకాలు పట్టుకొని బడికి పోవడమంటే అగ్రవర్ణ దొరలకు కళ్ళు మండవా మరి!. వాళ్ళతో సమానంగా రైలెక్కి రైలు పెట్టెలో ప్రయాణించి బడికి పోవడం వాళ్ళు ఓర్వలేరు కదా. అందులోను సువ్వి నికార్సైనది. మాటపడని ఆత్మగౌరవానికి మరోపేరు. ఒసే తసే అంటే, ఒరే,గిరే అంటుంది. అది రాముడికి ససేమిరా నచ్చ టం లేదు. "అన్నం లేని మాదిగలు, కుక్క- కుండలో మూతి పెట్టిందని, కుండను కుక్కలకే వదిలేస్తారు. అట్లాంటిది, చెడిన సువ్విని పెళ్ళాడిన వీడు ఏం మనిషి?" ప్రేమ ఉన్నచోట ఎంగిలి ఉందురా! ప్రేమ ప్రపంచాన్ని జయించేవరం మూగోడు వరపుత్రుడని ప్రేమదాని మూల ధాతువు గురించి గొప్ప నిర్వచనం చెప్పాడు రచయిత. "వాడికి సొంత ఇల్లులేదు. అమ్మా, నాన్న లేరు. ఊరు పేరులేదు, అనాదోడు. వాణ్ణా? వాణ్ణి పెళ్ళి చేసుకొని ఏం పీక్కుతింటావు అని సువ్వితో అన్నాడు కోటి. మూర్ఖుడు, దుర్మార్గుడు నాంచారయ్య కొడుకు రాముడు బారి నుండి తప్పించుకోవాలంటే పెళ్ళి తప్పదన్నట్లుగా చెప్పింది సువ్వి.

రంధి నవలలో బైరాగి పాత్ర ఒక అద్భుత మలుపు. మూగవాడు, దిక్కు దశలేని చందిరికి బైరాగి కొండంత అండ. మాటలు వచ్చీ రానట్టు నటించే బైరాగి చందిరి మూగ భాషను అతనొక్కడే అర్థం చేసుకోగలడని రచయిత తన రచన ద్వారా నిరూపించాడు. కష్టకాలంలో చందిరికి ...

మాదిగ పల్లె ఆ రాత్రి అద్భుతమైన రాత్రి, వేజెండ్ల పెత్తందారి, భూస్వామి అయిన నాంచారయ్య తన కొడుకు రాముడు మరణంతో తనలో ఉన్న అహంకారాన్ని, ఊర్లో వదిలి పెట్టి సరాసరి మాదిగ పల్లెలో అడుగుపెట్టి ఊర్లోకి నడవడం ఆ మార్పు రావడానికి, మాదిగ పల్లె మరియు మాదిగ పెద్దల ఐక్యమత్యమే కారణం. ఐకమత్యం నుంచి అద్భుతాలు జరుగుతాయని గుర్తించారు మాదిగ పల్లె ప్రజలు. ఆ మహత్తర సంఘటనను గొప్పగా ఆవిష్కరించారు రచయిత. ముందు కథలో కుక్కలు తరుముతుంటే పందులు అమాయకంగా రైలు కిందపడి కుక్కలకు ఆహారమయ్యేవి. ఇప్పుడు దశ్యం మారింది. రైలుబండి వస్తుంది. కుక్కలు పందిని తరుముతున్నాయి. పంది తన ముట్టెతో కుక్కని రైలు కిందకు తోసింది. కుక్క ముక్కలయ్యింది. కథలోని నీతేంటంటే సమాజంలోని ఆదిపత్య జాతే ఎప్పుడు గెలవదు. గెలుపోటములు రెండువైపులా ఉంటాయని నోరులేని మూగ జీవాల ద్వారా కథలోని నీతిని చెప్పించాడు రచయిత. "తెలివి ఏ ఒక జాతి సొత్తు కాదంటాడు". ఎలుక ఎక్కిన గణపతిలా ఉన్నాడు చందిరి. రంధి నవల ను గొప్పగా నడిపాడు రచయిత కొల కలూరి ఇనాక్. అందరు చదవాల్సిన గొప్ప నవల రంధి.


- దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి
8096225974




## లతనై పెరిగి వృక్షాన్నై విస్తరిస్తా

నాది అహంభావం అంటారేమో
నాది ఆత్మ విశ్వాసం అని
ఆత్మ సాక్షిగా ప్రకటించుకుంటాను
మొగ పోరగాళ్లు జేసే పనులు
ఆడపోరికెందుకు? అని ఎక్కిరించిన నాడు
నడుం కట్టి బురద పొలాన్ని దున్ని
బువ్వ పండించిన
అన్నధాత్రినే అయ్యిన నాడు
అంతా చూస్తే నా వయసు అప్పుడు
పదహారణాలే ...
అయ్యకు తోడుగా అరక పట్టి దున్నుతోంది
ఎంత ఎగిడ్సిపోత పోరికి
అని ఆడా మగా ఆనాడే అన్నారు
అహంభావం నాది అని,
కాదు నాది ఆత్మ విశ్వాసమే.

కాలం కన్నెర్ర చేసి
కన్న తండ్రిని కాటిలో కాల్చేసిన నాడు
ఆడ పోరగాళ్ళకి ఆధారం లేదు
బతుకు కుక్కలు చింపిన ఇస్తరాకే
అని ఆడా మగా అనుకున్న రోజే
బతుకు పోరాటం లో బందూకునై గర్జిస్తా,
బాపు బాధ్యత ని భుజానికెత్తుకొని మోస్తా అంటూ
రక్తం నిండిన కళ్ళతో సవాల్ విసిరిన రోజూ
అహంభావం అనుకున్నారు నాది,
కాదు ఆనాడూ నాది ఆత్మ గౌరవమే.

పట్నం పోయి పెద్ద సదువు సదువాలే
పెద్ద కొలువు జెయ్యాలె అన్న బాపు
కలను తీర్చాలే అని
పట్నం బాట పట్టినప్పుడు కూడా
అయ్య అదుపు లేని పిల్ల
ఆగం అవుతుంది అంటూ
ఎకసెక్కాలు జేసిన నోళ్లకు
నా సదువు గోల్డ్ మెడల్‌తో
బరిగీసి గురి తప్పని తూటా
విసిరినప్పుడు కూడా
అహంభావం అనుకున్నారు నాది,
కాదది నా ఆత్మగౌరవ ప్రకటన.

సదువయ్యింది, ఓ అయ్యి చేతిలో పెట్టుండ్రి,
ఆడిది ఉద్యోగాలు జెయ్యాలా,
ఊర్లు ఏలాలా అంటూ
ఉచిత సలహాల మొహం మీదే
చురకత్తుల చూపుల్ని విసిరి
ఈడ్చి మొహం మీదే తలుపు వేసి
నా ధిక్కారాన్ని ప్రకటించినపుడు
అహంకారం అనుకున్నారు కాబోలు
కాదది నా ఆత్మ విశ్వాస గీతం.

పట్టా పట్టి, అవకాశాల తలుపు తట్టి,
కొలువు కొట్టి అమ్మకి అయ్యంత
ఆసరా అయిన నాడు,
అక్కలు చెల్లెలికి అన్నలా
అండ నిలిచిన నాడు
విజేతగా నిలిచిన నన్ను చూసి
అహంభావం అనే అనుకున్నారు వారు,
అది నా విజయ గీతం
అని ఆత్మ సాక్షిగా ప్రకటన చేసాను.

బాల్యం నుండి బతుకాఖరు దాకా
ఇంటి గడప నుండి కొలువు కుర్చీ దాకా
క్యార్ మన్న రోజు నుండి
కాటికి పోయే దినం దాకా
ఆడదాని బతుకు ఆంక్షల మయమే

అయితేనేం...
నిత్య సమర సంచారిని నేను
ఎగిరే ధిక్కార పతాకని నేను
మండే కొలిమి నుండి ఉబికి
ముంచెత్తే లావా ప్రవాహాన్ని నేను
నేను నేటి మహిళను
రేపటి భవితను
లతనై పెరిగి
మహా వృక్షాన్నై విస్తరిస్తాను
అడ్డొచ్చే ముళ్ల కంచెల్ని
అడుగు కింద కప్పెడతాను
శిలాక్షరం నా వాక్కు
సమానత్వం నా హక్కు....


డా. బాశెట్టి లత
అసోసియేట్ ప్రొఫెసర్
తెలుగు శాఖ,
హైదరాబాద్ విశ్వవిద్యాలయం.




## పల్లెకు చేరిన పద్యం

తే.గీ:
కందుకూరి,చిలకమర్తి కాళ్లకూరి
తిరుపతికవీశ్వరుల్,తాంద్ర,వరుసకట్టి
నాటకవులెల్లరు తెలుగునాటవెలిగి
పద్యమధురిమల్ ప్రజలకు పంచినారు!

తే.గీ:
తెలుగు పద్యాలయందున్న తీయదనము
పల్లెపల్లెకు చేర్చెను పరవశమును
పద్యమునకింత కీర్తియు ప్రబలుటకును
నాటకమ్ములే మూలము మేటిగాను!

తే.గీ:
రాత్రి మొదలగునాటకరాజములను
పొద్దుపొడిచెడి వరకును పొలుపుమీర
నాలకింతురు కూర్చొని నేలపైన
వాడవాడల జనులెల్ల వేడుకగను!

తే.గీ:
రాగములతోడ పద్యముల్ రమ్యముగను
సాగి యమృతప్రవాహమై జాలువారు
పద్యములకర్థమెరుగని వారలైన
గోలచేయుచునుండు వారీలలందు!

కం:
బహుమారులు పద్యములను
బహుపర్యాయములుకోరి పాడింత్రుజనుల్
వహవా యాస్వాదించుచు
మహదానందంబుగ బహుమానములిడుచున్!


రచన: రఘుపాత్రుని.సాయిశివ
శ్రీకాకుళం : 94933 16130




## నా ప్రపంచం...

ఈ దారి నిశ్శబ్దంగా ఉంది,
కానీ నా మనసు మాత్రం కాదు...
ప్రతి అడుగులో నీ ఉనికే
నాతో మాట్లాడుతున్నట్టుంది...

నీలి ఆకాశం కూడా
మన ప్రేమకి సాక్షిలా
మబ్బులతో కలల దుప్పటి కప్పి
నన్ను ఆశీర్వదిస్తోంది...

ఈ దారిలో
నేను ఒంటరిగా నడుస్తున్నా,
నా నీడలో
నీ చేతి స్పర్శ కనిపిస్తోంది...

ఎడమవైపు భూమి,
కుడివైపు నిశ్శబ్దం,
మధ్యలో నేను...
నా హృదయంలో నువ్వు...

ఇక గమ్యం అవసరం లేదు,
ఈ దారిలో నీతో కలిసి గడిచిన క్షణాలే
నా ప్రపంచం...

ఒక రోజు ఈ దారి ముగిసినా,
ప్రేమ మాత్రం ముగియదు...
ఎందుకంటే
నువ్వు నా
గమ్యం కాదు,
నా ప్రయాణం...




కళ్యాడపు శ్రవణ్ కుమార్
99631 65758.


## జీవితం గురి గురితప్పుతుంది

జీవితం గురి తప్పుతుంది
మనసు రంపపు కోతకు గురవుతూ !
మళ్ళీమళ్ళీ తెప్పరిల్లుతుంది
సంకల్పం విచ్ఛిన్నమై పోరాటాన్ని
స్వేచ్ఛగా ధ్వంసం చేస్తుంది.

మనసులు గెలవాలని
కాలం ఉవ్విళ్ళూరుతుంది.
నడి వీదులు చెరసాలుగా
రూపాంతరం చెందుతున్నాయి

ఈ విషపూరిత వలమాలిని ఛేదించాలి.
గతించిన గమనాలను సాధించాలి.

పొద్దులకు హద్దులు నేర్పే
సమరాన్ని సమంగా నాటే వీరులు కావాలి
జ్ఞాన గుప్పెట విప్పే యోధులు రావాలి

ఇప్పుడు
సమధర్మపు కాంతిరేఖలు లేనేలేవు
యుగయుగవు నైతిక విలువలు కానేకావు.

ఊరువాడలు రుధిరతీరాలుగా మారుతున్నాయి
వివక్షతల వర్ణకుటీరాలు
ఇరవై ఆరులోకూడ నిస్సిగ్గుగా విజృంభిస్తుంటే!

మమతలు లేని మనుషులుగా
కాస్త సిగ్గుపడదాం!
మేధస్సు మౌన తీరాలను చూస్తూ
నరజాతి చరిత్రను వీక్షించడం తగదు

అదిగదిగో చూడు
భువన ఘోషల సమరభాషల
అగ్నివీణల ఆక్రందనలు
నడకలేని రాజ్యానికి
పురిటి పాట పాడుతూ
దిగంబర నృద్యం చేస్తున్నారు...

రెక్కలు డొక్కలు మలమల మాడుతున్నా
వంటి చేతి వందనాలు ఉత్తమమూ
ఇకనైనా కలాలు పట్టండి
చరిత్ర పుటల్లో దున్నండి
పంచాలు వుంఖాలు సాహత్య సేద్యం చెయ్యండి

నేడు బలిపీఠాలు కాదు
బతుకు చిత్రాలు కావాలి.

అప్పుడే !
పాటల పీటలు పదునెక్కుతాయి.
యుగసంఘీ భావ గీతాలు
చైతన్య తీరాలు తాకుతాలు !
ఇవి సమాజాన్ని జయించక మానవులే!
గుండె గుండెను స్పృశించక ఆగవులే!


డా. బద్దిపూడి జయరావు
9949065296




## కాలం ఒక మాయలేడి

మాయలేడి లాంటిది కాలం.. ఉరకలెత్తిస్తుంది,
గెలిస్తే నేలపై సంబరాలు చేయిస్తుంది.
ఓడితే పాతాళానికి తొక్కి సతాయిస్తూ,
తన ఆధిపత్యాన్ని నిత్యం ప్రదర్శిస్తుంది.

క్షణ కాలంలోనే కోరికలు సృష్టించి,
మనసు అలలపై ఉవ్వెత్తున ఎగిసిపడి..
నిరాశలో ముంచి, తనువును గాయపరుస్తూ,
మంత్ర దర్పణంలా మాయలు చేస్తుంది.

పసి నవ్వుల జలకళలతో కలకలలాడిస్తూ,
ఆనంద లోకంలో మనల్ని ఈదులాడిస్తూ..
సముద్రంలో సుడిగుండాలను సృష్టించి,
తాను ఎక్కడా నిలువనని సందేశమిస్తుంది.

అపురూప దృశ్యాన్ని కళ్ళకు కట్టి,
మరుక్షణమే చీకటి మేఘాన్ని కప్పేసి..
చీకటి వెలుగుల మధ్య తాను నవ్వుతూ,
సంధ్య వేళలో ఒక హెచ్చరికై కనిపిస్తుంది.

నీవెంతో విజ్ఞానివని విర్రవీగినా..
జీవిత రంగస్థలంపై నిన్ను ఆడిస్తూ,
పాత్రలు సృష్టించి, కళాత్మకంగా నటించి,
నేలతెరపై నీ ఆటను ముగించి వేస్తుంది.


ఉన్నట్టుండి కొత్త పరిచయాలను అందించి,
నీ అస్తిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చి..
కల్లబొల్లి కబుర్లతో ఎండమావుల్లో నడిపించి,
చదరంగపు ఎత్తుగడలా జీవితాన్ని ఆడిస్తుంది.


కొప్పుల ప్రసాద్, నంద్యాల
9885066235




## ఈ నెలలో తెలుగు జాతీయ సదస్సులు....




## సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం *నినాదం* పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064